"ఊహూ. అనారోగ్యంగా ఉన్న అనేకమందికి ఆరోగ్యం చేకూరాలని దేవుడ్ని ప్రార్ధిస్తాను. ఇలా నిత్యం నా జాబితాలోని అందరి కోసం ట్రాఫిక్ లైట్ల వల్ల ప్రార్ధనలని చేయగలుగుతున్నాను." చెప్పాడు ఆయన.

మన సమయం వృధా అవడం లేదా అవకపోవడం అన్నది మన చేతుల్లో ఉంది తప్ప పరిస్థితుల్లో కాని, ఇతరుల చేతుల్లో కాని ఉండదు.

## 112. గుడ్డి బిచ్చగాడు

ఓ సినిమా హాలు బయట ఓ బిచ్చగాడు రోడ్డు పక్కన చిరిగిన దుప్పటిని పరచుకుని, దాని మీద కూర్చుని అడుక్కుంటున్నాడు. అతను అంధుడు. కొందరు విసిరిన నాణాలు అతని దగ్గరకి చేరకుండా పక్కకి వెళ్ళినా అతను వాటిని తీసుకోలేదు.

దారిన వెళ్ళే ఒకతను ఇది చూసి ఆ నాణాలన్నిటిని ఏరి ఆ గుడ్డివాడి దుప్పటి మీద వేసాడు.

"టైమెంతైంది బాబు?" అలికిడి విని ప్రశ్నించాడు బిచ్చగాడు.

"రెండుం పావు."

చెప్పి తర్వాత అతను తన దారిన తను వెళ్ళిపోయాడు. రెండు నిముషాలు ఆగి, ఆ గుడ్డివాడు లేచి నాణాలని జేబులో వేసుకుని, దుప్పటిని మడిచి భుజాన వేసుకుని చేతి కర్రని తాటిస్తూ ఎదురుగా వున్న సినిమా హాల్లోకి వెళ్ళాడు. టిక్కెట్టు కొనుక్కుని వారం క్రితం విడుదలైన ఆ సినిమాకి వెళ్ళాడు.

ఇంట్రవెల్‌లో తన పక్కన కూర్చుని ఉన్న, తను సహాయం చేసిన ఆ అంధుడ్ని చూసి అతను ఆశ్చర్యంగా అడిగాడు.

"నీకు కళ్ళు కనపడతాయా?"

"ఊహూ."

"మరి సినిమాకి ఎందుకు వచ్చావు?"

"విందామని." జవాబు చెప్పాడు ఆ గుడ్డి బిచ్చగాడు.

వాంఛ గుడ్డిది.